క్లుప్తంగా

పంట కోత ప్రయోగం

తంబళ్లపల్లె : మండలంలోని ఎద్దులవారిపల్లె రైతు సేవా కేంద్రం పరిధిలో రెడ్డప్ప సాగు చేసిన వేరుశనగ పంటను జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రనాయక్ పరిశీలించారు. పంట కోత ప్రయోగాన్ని నిర్వహించి దిగుబడిని లెక్కగట్టారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు శివశంకర్, ఏఓ రమణ కుమార్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి

తంబళ్లపల్లె : బాల్య వివాహాలను అరికట్టేందుకు ఐసీడీఎస్, మహిళా పోలీసులు సమష్టిగా కృషి చేయాలని డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రతినిధి షకీలా కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నియంత్రణ కమిటీల ఏర్పాటుపై చర్చా, సమావేశం జరిగింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధమ్మ, కుసుమ, తంబళ్లపల్లె, పెద్దమండ్యం మహిళా పోలీసులు పాల్గొన్నారు.

గంగమ్మకు బంగారు కిరీటం బహూకరణ



బంగారు కిరీటంతో కమిటీ నిర్వాహకులు

మదనపల్లె సిటీ : స్థానిక కోర్టు ఆవరణలో వెలసిన గంగమ్మ అమ్మవారికి కమిటీ సభ్యులు బంగారు కిరీటం బహూకరించారు. గురువారం ఆలయంలో భక్తుల సమక్షంలో కిరీటం ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ మార్పురి చిన్నరెడ్డప్ప మాట్లాడుతూ శనివారం విజయదశమి రోజున బంగారు కిరీటం అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. ఆ రోజు అన్నదానం, మహిళలకు గాజులు, పసుపు, కుంకుమ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెరవలి గోపాల్‌నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు, కోశాధికారి రంగస్వామినాయుడు, కరుణాకర్, సభ్యులు భవానీప్రసాద్, విక్కి, మహేష్, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించండి

మదనపల్లె : పట్టణంలోని నీరుగట్టువారిపల్లె ప్రధాన రహదారిపై ఆక్రమణల తొలగింపుకు స్థానికులు సహకరించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విజ్ఞప్తి చేశారు. గురువారం తహసీల్దార్ ఖాజాబీ, ట్రాన్స్‌కో ఈఈ గంగాధరం, టౌన్ సర్వేయర్ చిన్నరెడ్డెమ్మతో కలిసి నీరుగట్టువారిపల్లెలోని రోడ్డుపై ఆక్రమణలను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాధాకృష్ణ సిల్క్ సమీపంలో మలుపువద్ద రోడ్డు వెడల్పుగా ఉన్నప్పటికీ, ఆక్రమణలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన రోడ్డు కొలతలకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. నేషనల్ హైవే అధికారులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నీరుగట్టువారిపల్లె ప్రధాన రహదారి 100-125 అడుగులు ఉన్నప్పటికీ, కొందరు రోడ్డు స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

రామసముద్రం : ప్రజల సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆయన మండలంలోని అజ్జమరెడ్డిపల్లెలో పర్యటించారు. అక్కడ వెలసిన శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో ధర్మకర్త మోడెం సిద్దప్ప ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి, ఉత్సవాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మోడెం సిద్దప్ప, నాయకులు విజయగౌడ్, పెద్దిరెడ్డి, కృష్ణంరాజు, సీతారామయ్య, కోవా కృష్ణమూర్తి, కృష్ణప్ప, లోకేష్, రాజు, బాలాజి, తిప్పన్న, సుబ్రమణ్యం, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలికల గురుకులం.. సమస్యలమయం



తలుపులు లేకుండా అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



కిటికీ దోర్లు లేని తరగతి గదులు

- వర్షం పడితే తరగతుల బంద్
- తలుపులు లేని మరుగుదొడ్లతో అవస్థలు
- వసతులు లేని అద్దెభవనంలో కాలం వెళ్లదీత

పీలేరు : గిరిజన బాలికలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన గిరిజన బాలికల గురుకుల పాఠశాల సమస్యల వలయంలో చిక్కుకుంది. కేవీపల్లె మండలానికి మంజూరైన గిరిజన బాలికల గురుకుల పాఠశాల.. ఆ మండలంలో సొంత భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా పీలేరులో నిర్వహిస్తున్నారు. స్థానిక కోటపల్లె క్రాస్ సమీపంలో కనీస వసతులు లేని అద్దెభవనంలోనే కాలం గడుపుతున్నారు. సుమారు 180 మంది విద్యార్థినులు ఉన్నారు. మరుగుదొడ్లకు కనీసం తలుపులు కూడా లేకపోవడం విచారకరం. సక్రమంగా నీటి సరఫరా లేదు. తరగతి గది కిటికీలకు దోర్లు లేకపోవడంతో వర్షం పడిన సమయంలో నీరు తరగతిలోకి చేరుతుంది. దీంతో వర్షం పడిన సమయంలో తరగతులు నిర్వహించలేకపోతున్నారు. ఈ పాఠశాలను పలువురు అధికారులు సందర్శించినా విద్యార్థుల సమస్యలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పాఠశాలకు స్థలం కేటాయించాలని, సొంత భవనం మంజూరు చేయాలని ప్రతిపాదనలు చేసినా ప్రయోజనం లేకపోయింది. కేవీపల్లె మండలంలో ఒకట్రెండు చోట్ల పాఠశాలకు అవసరమైన స్థలం సర్వే చేసి వదిలేశారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన ఎస్టీ కమిషన్ డైరెక్టర్ వడిత్యా శంకర్‌నాయక్‌కు తమ సమస్యలపై విద్యార్థులు మొరపెట్టుకున్నారు. సొంతభవనం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సమస్యలపై కలెక్టర్‌కు వివరించాం

గిరిజన బాలికల గురుకుల పాఠశాలలోని సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వివరించడం జరిగింది. పాఠశాలకు అనువైన స్థల పరిశీలనకు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పాఠశాలలో సమస్యలు పరిష్కరించి మెరుగైన వసతులు కల్పించడానికి మా వంతు కృషి చేస్తాం.

– తేజస్విని, ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారిణి

చిన్నచూపు తగదు



గిరిజన విద్యార్థినులపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు చిన్నచూపు తగదు. మరుగుదొడ్లకు, బాతురూములకు కనీసం తలుపులు లేకపోవడం దారుణం. కనీసం అధికారుల పర్యవేక్షణ ఉందా? ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలి. పాఠశాలకు పక్కాభవనం మంజూరు చేయాలి.

– అమృతతేజ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

మదనపల్లె సిటీ : మహిషాసురమర్దిగా వాసవీమాత



పీలేరు : దుర్గాదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి



రామసముద్రం : అజ్జమరెడ్డి పల్లెలో రాజరాజేశ్వరిదేవి



బి.కొత్తకోట: ధనలక్ష్మి అలంకరణలో వాసవీదేవి



వాల్మీకిపురం : చింతపర్తిలో దుర్గాదేవిగా వాసవీమాత



కలికిరి : దుర్గాదేవిగా ఎల్లమ్మతల్లి



జయహో దుర్గాదేవి

మదనపల్లె సిటీ : దేవీ నవరాత్రుల సందర్భంగా మదనపల్లె పట్టణంలో గురువారం అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ అమ్మవారు శ్రీ మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆర్యవైశ్య హాస్టల్‌లో సామూహిక దుర్గా హోమం నిర్వహించారు. నీరుగట్టువారిపల్లెలోని శ్రీచౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దినిగా, దేవళం వీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీ లలితాత్రిపురసుందరిదేవిని శ్రీ బాలత్రిపుర సుందరిదేవిగా, సిటిఎం రోడ్డులోని శ్రీ రాజరాజేశ్వరి ఆలయంలో మధురమీనాక్షిగా అలంకరించారు. దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో దర్బార్ అలంకారంలో ఆలయ చుట్టూ ఊరేగించారు. బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో, భువనేశ్వరినగర్‌లో మహా విద్య శ్రీ బగళాముఖీదేవిగా, బి.టి.కాలేజి మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో స్వామి విభూది అలంకరణ చేశారు.

పీలేరు : స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం, మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి, ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

రామసముద్రం : మండలంలోని అజ్జమరెడ్డి పల్లి శ్రీరాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు పసుపు, కుంకుమ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కలకడ : మండలంలోని కోన, కలకడ, గుడిబండ, కదిరాయచెర్వు, కె.బాటవారిపల్లె ఆలయాల్లోని చౌడేశ్వరిదేవిని దుర్గాదేవిగా అలంకరించారు.

కేవీపల్లె : మండలంలోని చీనేపల్లెలో రామలింగ చౌడేశ్వరి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

వాల్మీకిపురం : స్థానిక శ్రీ నల్లవీరగంగాభవాని అమ్మవారిని, వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం, గండబోయనపల్లిలోని సత్యమ్మ తల్లి, గొళ్లపల్లిలోని విరూపాక్షమ్మ, చింతపర్తిలోని వాసవీ కన్యకాపరమేశ్వరిని దుర్గాదేవిగా అలంకరించారు.

బి.కొత్తకోట : స్థానిక కాళికమ్మ ఆలయంలో కాళికాదేవి మహిసాసురమర్దిని, కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవీదేవి ధనలక్ష్మీ అలంకరణలో దర్శనమిచ్చారు.

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని శివాలయంలో పార్వతిదేవికి దుర్గాదేవి అలంకరణ చేశారు.

కలికిరి : కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ, సోమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

కంటి వ్యాధులపై అవగాహన అవసరం



మదనపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా ఆస్పత్రి వైద్యులు

మదనపల్లె : ప్రతి ఒక్కరూ కంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ సర్వజన బోధనాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు అన్నారు. గురువారం 25వ ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ఎం.ఎస్.రాజు, ఆర్ఎంఓ ప్రసాద రాజు, డాక్టర్లు లక్ష్మీకళ, దివ్య, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కలాంఆజాద్, భాస్కర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : చింతపర్తి పీహెచ్‌సీ పరిధిలో కంటి సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్లు శ్రీవిద్య, జులేఖబేగం, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, సీహెచ్‌వో ఇంద్రాణి, సూపర్‌వైజర్ సుధాకర్, భానుభి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ : మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి, యంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సిబ్బంది భారతమ్మ, సుబ్బరత్నమ్మ, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా సేవలు మరువలేనివి

మదనపల్లె : భారత వ్యాపార, ఆర్థిక రంగాలకు రతన్ టాటా అందించిన సేవలు మరువలేనివని మదనపల్లె డివిజన్ మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, టాటా గ్రూప్స్ గౌరవ చైర్మన్ రతన్‌టాటా మృతికి సంతాప సూచకంగా స్థానిక నిమ్మనపల్లె సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాదెళ్ల రామన్న, గల్లా భాస్కర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం : స్థానిక బస్టాండ్‌లో కూటమి నాయకులు రతన్ టాటా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెం శివయ్య, కార్యం శంకర, రామాంజులు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ రక్షణకు ముందుకు సాగుదాం

కలకడ : ధర్మ రక్షణ కోసం అందరం కలిసి ముందుకు సాగుదాం అని జిల్లా ధర్మ రక్షణ కమిటీ కన్వీనర్, గౌరవ అధ్యక్షులు శేషాద్రినాయుడు, మల్లికార్జునస్వామి అన్నారు. గురువారం మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలో శ్రీసాయి మందిరంలో ఏర్పాటు చేసిన ధర్మరక్షణ సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సాయిబాబా ప్రాగణ ట్రస్ట్ గుర్రంకొండ చైర్మన్ ప్రభాకర్‌మూర్తి, మహేంద్రమఠ్రి పీఠాధిపతి మల్లికార్జునస్వామి, పూజారి నాగయ్యస్వామి, రామాంజులు, తిప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీతో టమాటాలు పంపిణీ

పీలేరు రూరల్ : మార్కెట్‌లో టమాట ధరలు అధికం కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పీలేరు మార్కెట్ యార్డులో స్థానిక ప్రజలకు రాయితీతో టమాటాలు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడీ త్యాగరాజ్ తెలిపారు. గురువారం మూడు టన్నుల టమాటాలను కిలో రూ. 35 చొప్పున ప్రజలకు పంపిణీ చేశారు. పీలేరులో సబ్సిడీ వంటనూనె విక్రయం కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోదేషావలి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏడీని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.



